నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | జులై 04, 2024 | www.navatelangana.com

పాఠశాలలో ఎంపీటీసీకి సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్

ఎంపీటీసీల పదవి కాలం ముగియటంతో మండల కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బుధవారం ఎంపిటిసి సామల పద్మ - వీరయ్యను శాలువాతో సన్మానించారు. పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, శేఖర్, హన్మాండ్లు, శ్రీదేవి, ప్రవళిక విద్యార్థులు పాల్గొన్నారు.



సికిల్ సెల్ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర అధికారి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వాఘాపూర్‌లోని కేసులను పరిశీలించారు. కొలాం గిరిజనుల రక్త పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంకోలి పీహెచ్‌సీ డాక్టర్ సర్ఫరాజ్, డిడిఎం శివప్రసాద్, రోజా రమణి, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేమసింగ్ పాల్గొన్నారు.



మండలాభివృద్ధికి సహకరించాలి



దస్తురాబాద్ : మండల అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సింగారి కిషన్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో పలు శాఖల గురించి వివరణ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, గెలిచినా, ఓడినా ప్రజల పక్షాన ఉండి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని ఎంపిటిసిల పదవీకాలం ముగిసినందున, వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి శారద శ్రీనివాస్, వైస్ ఎంపీపీ భుక్య రాజు నాయక్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రావ్ శైలజ, డిప్యూటీ తహసీల్దార్, సెక్రటరీలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షులు గుండా నరేష్, పుల్యానాయక్, స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

ముగిసిన చివరి సర్వసభ్య సమావేశం



తాంసి : భీంపూర్ మండల చివరి సర్వసభ సమావేశం బుధవారం రైతువేదిక భవనంలో ఎంపీపీ రత్నాప్రభ సంతోష్ అధ్యక్షత నిర్వహించారు. ముందుగా మండల వైద్యాధికారి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగు నెలల నుంచి డెలివరీ కిట్స్(కేసిఆర్ కిట్) రావడం లేదని వివరించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు టెండర్లు వేయడం లేదని జడ్పిటిసి అధికారులపై ఫైర్ అయ్యారు. ఐదు సంవత్సరాలుగా ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని అటవీ అధికారులను జెడ్పీటీసీ ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ ఏఈ రవీందర్ మాట్లాడుతూ రుణమాఫీ గైడ్ లైన్స్ ఉన్నతాధికారుల నుంచి రాలేదన్నారు. ఉపాధి హామీలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నామని ఏపీవో సంగీత తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ గుబిడి గ్రామానికి నాలుగు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం అందించామన్నారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీపీతో పాటు ఎంపిటిసిలను తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణరావు, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, మండల ప్రత్యేక అధికారి కిషన్, మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్, ఎంపీటీసీలు రెడ్డివార్ దేవమ్మ-రమేష్, భోజన్న యాదవ్, గంగమ్మ, మడావి అన్నపూర్ణ, నాయకులు సంజీవ్‌రెడ్డి, అనిల్, నరేందర్, గంగయ్య, జహూర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



తలమడుగు : ఖోడద్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్‌లు సుకుమార్ పెట్కులే, సురేఖ, పీఈటి నుండి పీడీగా పదోన్నతి పొంది ఇంద్రవెల్లికి వెళ్లిన మమతను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు బోధన చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేశారు. విద్యార్థులకు అందించిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఓరగంటి పురుషోత్తం, పీజీ హెచ్ఎం వెంకన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, పాఠశాల సిబ్బంది లక్ష్మి సురేఖ, వాసుదేవ్, సత్యనారాయణ, సందీప్‌రెడ్డి, గిరిజ, జోత్స్న విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఇమ్యునైజేషన్ అధికారి




ఆదిలాబాద్‌రూరల్ : అంకోలి ఆస్పత్రిని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.వైసి.శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి అంకోలి ఆస్పత్రిని సందర్శించారు. ముందుగా హాజరుపట్టికను చూసి ఎంతమంది లీవ్‌లో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యాక్సిన్ రూమ్, వ్యాక్సిన్ స్టాక్ పొజిషన్‌ను డాక్టర్ సర్ఫరాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న అంగన్వాడీ సెంటర్‌లో ఇమ్యునైజేషన్‌ను పరిశీలించి ఎంసిపి కార్డ్స్, రికార్డ్స్, డ్యూలిస్ట్, ఏఈఐఎఫ్ కిట్, హబ్ కట్టర్, వాహిల్ వివిఎం తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సర్ఫరాజ్, సిబ్బంది సచిన్, వీసీవీఎం సాయిప్రీతి, హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ప్రేమసింగ్, స్టాఫ్ నర్స్‌లు ప్రతిమ, సింధు, ఏఎన్ఎం లు ఈశ్వర్‌దేవి, వేణుతాయి, అంగన్వాడీ టీచర్ వందన, ఆయుష్ సిబ్బంది తిరుమల, ఆశా కార్యకర్తలు పద్మ, కవిత పాల్గొన్నారు.

అమాత్య పదవి ఎవరికీ..?

- ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్‌ల మధ్య దోబుచులాట
- ఈ ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమనే సంకేతాలు
- పదవి కోసం ఎవరికి వారు గట్టి ప్రయత్నాలు
- నేడో..రేపో ఖరారు చేయనున్న ఆ పార్టీ అధిష్టానం

ఉమ్మడి జిల్లాలో మంత్రి పదవి ఎవరికి దక్కుతుందనే విషయమై తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. తూర్పు జిల్లా నుంచి గెలిచిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఇద్దరు అమాత్య పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేయడం.. ఈ ఇద్దరిలో ఒకరికి కచ్చితంగా దక్కుతుందనే ఆ పార్టీ అధిష్టానం సంకేతాలు ఇవ్వడం ఇందుకు మరింత బలం చేకూరుస్తోంది. తొలి విడత మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి దక్కకపోవడంతో తాజా రెండో విడతలో తప్పనిసరిగా పదవి దక్కే అవకాశం ఉండటంతో ఎవరికి వరిస్తుందోనని తీవ్ర చర్చకు దారితీస్తోంది. మంత్రి పదవి కోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మధ్య తీవ్ర పోటీ ఉండటం.. ఎవరికి వారు పదవి కోసం అధిష్టానం వద్ద గట్టి ప్రయత్నాలు చేస్తుండటంతో ఉత్కంఠకు దారితీస్తోంది. ఆ పార్టీ అధిష్టానం నేడో..రేపో మంత్రి పదవులను ప్రకటించనుండటంతో ఎవరికి వరిస్తుందోనని రాజకీయవర్గాల్లో సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది.





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పన్నెండు మంది మంత్రులతో కేబినేట్ ఏర్పడింది. రాష్ట్రంలో మరో ఆరు స్థానాలను ఖాళీగా ఉంచింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం ప్రస్తుతం పాలనపై దృష్టి పెడుతోంది. తాజాగా ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయాలని ఆ పార్టీ అధిష్టానం యోచిస్తోంది. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాధాన్యం దక్కగా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మాత్రం తొలి విడతలో నిరాశ ఎదురైంది. హస్తం పార్టీకి ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా తూర్పు జిల్లా నుంచి మూడు స్థానాలు, పశ్చిమ జిల్లాలో ఒక స్థానం గెలుచుకుంది. దీంతో తాజాగా మంత్రి పదవి కోసం తూర్పు జిల్లాకు చెందిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ శాసనసభ్యుడు వివేక్ వెంకటస్వామి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరిలో ఒకరికి తప్పకుండా పదవి వరిస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఇరువురు నేతలకు అధిష్టానం వద్ద పలుకుబడి ఉండటంతో ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ అధిష్టానం సైతం పదవులు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండటంతో సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తోంది.

ఒకరికి ఛాన్స్..?

ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరికి మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని బలమైన ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల ఎమ్మెల్యేల కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అనేక ఏండ్లుగా పార్టీకి సేవలందించడమే కాకుండా టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఇంద్రవెల్లిలో నిర్వహించిన దళిత, గిరిజన దండోరా సభ విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించారు. దీనికి తోడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం ఆదిలాబాద్ జిల్లాలోని పిప్పిరి నుంచే పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర విజయవంతంలోనూ ప్రేమ్‌సాగర్‌రావు కృషిచేశారని ప్రచారం ఉంది. మరోపక్క ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మల్లికార్జున ఖర్గే తొలిసభను కూడా మంచిర్యాలలో నిర్వహించి విజయవంతం చేశారనే పేరుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రివర్గంలో స్థానం కోసం భట్టి విక్రమార్క కూడా అధిష్టానం వద్ద గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సైతం బీజేపీలో కీలక పదవిలో ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానంలోని కీలక నాయకులతో పరిచయాలు ఉండటంతో వారి ద్వారా మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా తూర్పు జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు బలమైన వారే కావడం..ఎవరికి వారు మంత్రి పదవి కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తుండటంతో అధిష్టానం ఎవరికి పదవి కట్టబెడుతుందోననే చర్చ తారాస్థాయికి చేరింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రాజకీయవర్గాల్లోనూ ఇదే అంశంపై ప్రధానంగా చర్చ సాగుతుండటం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-ముధోల్

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బాసర ఆర్జీయూకేటీని ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో సందర్శించారు. కళాశాల సమావేశ మందిరంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన, పరిపాలన, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలు, కార్యక్రమాల నిర్వహణ, క్రీడా, సాంస్కృతిక రంగాలలో విద్యార్థుల ప్రతిభ తదితర అంశాలపై అధికారులు, విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల ఆలోచన విధానం అత్యుత్తమైనదై ఉండాలని, సృజనాత్మకతను కలిగి ఉండాలని తెలిపారు. నూతన ఆవిష్కరణకు విద్యార్థులు శ్రీకారం చుట్టాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం అందిస్తుందని తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నూతన యాప్‌లను తయారు చేసేందుకు విద్యార్థులు సంసిద్ధం కావాలని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా వివిధ విభాగాలకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. అందులో విద్యా కమిటీ, సోషల్ సర్వీస్, కల్చరల్, గ్రీవెన్స్, మెస్ అడ్వైజరీ, కెరీర్ గైడెన్స్, సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, హెల్త్, ప్లేసెమెంట్ అండ్ ఇంటర్న్‌షిప్, ఫొటోగ్రఫీ, ఇన్నోవేషన్ వంటి 18 కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరిపాలన అధికారులకు విద్యార్థులకు మధ్య ఒక వారధిగా కమిటీలు పని చేస్తాయని, కమిటీల పనితీరు విధి విధానాలు, లక్ష్యాలను కలెక్టర్ వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు పెద్దపీట వేస్తామని, సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా ఎస్పీ కార్యాలయానికి తెలియజేయాలని తెలిపారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎస్పీ మొక్కలు నాటారు. ఆ తర్వాత అధికారులతో కలిసి భోజనశాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎస్పీ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కోమల్‌రెడ్డి, ఆర్జీయూకేటీ స్పెషల్ ఆఫీసర్ సృజన, అసోసియేట్ డీన్ ఇంజనీరింగ్ మహేష్, చీఫ్ వార్డెన్ శ్రీధర్, పిఆర్ఓ డాక్టర్ విజయకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, రెవెన్యూ, పోలీసు, కళాశాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

రిమ్స్‌లో అధునాతన శస్త్రచికిత్సలు

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- క్రానియోటమీ శస్త్రచికిత్స విజయవంతం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో అత్యవసర అధునాతన శస్త్ర చికిత్సలు అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. పట్టణానికి చెందిన రోహన్‌కు ఇటీవల జరిగిన ఓ రోడ్డుప్రమాదంలో తలకు గాయమైంది. అతనికి న్యూరో సర్జరీ క్రానియోటమీ శస్త్రచికిత్స అవసరమవగా డాక్టర్ విజయ్ మోహన్ ఆపరేషన్ చేశారు. శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో రోగిని బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి సర్జరీకి సంబంధించిన వివరాలను డైరెక్టర్ తెలియజేశారు.

రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు

రిమ్స్ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో అధునాతన వైద్యం అందిస్తున్నామని డైరెక్టర్ తెలిపారు. ప్రస్తుతం న్యూరో, కార్డియాలజీ, యూరాలజీ ఇతర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇటీవల న్యూరో సర్జరీని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్నీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ విజయ్ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 22న యాక్సిడెంట్‌లో తలకు తీవ్రమైన గాయంతో రోహన్ రిమ్స్‌లో చేరారన్నారు. సీటీ స్కాన్ చేసి అత్యసవరసంగా అపరేషన్ చేయాలని డైరెక్టర్ సూచనల మేరకు విజయవంతంగా అపరేషన్ పూర్తి చేశామన్నారు. పది రోజుల పాటు పర్యవేక్షణ ఉంచి డిశ్చార్జ్ చేశామన్నారు. ఇదే ఆపరేషన్ బయట ప్రయివేట్ ఆసుపత్రిలో అయితే మూడు నుంచి ఐదు లక్షల వరకు అవుతుందన్నారు. రోగులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిమ్స్ క్వార్టర్స్‌లో మొక్కల నాటే కార్యక్రమం

వన మహోత్సవంలో భాగంగా రెండవ రోజు రిమ్స్ డాక్టర్స్ క్వార్టర్స్ ఆవరణలో డిడబ్ల్యూఓ సబితతో కలిసి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మొక్కలు నాటారు. వెయ్యి మొక్కలు నాటడం లక్ష్యంలో భాగంగా వైద్యుల క్వార్టర్స్‌లో 200 మొక్కలు నాటడం జరిగిందన్నారు. అలాగే నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్ స్పెషలిటి సూపరింటెండెంట్ డాక్టర్ ఇద్రిస్ అక్బానీ, సహాయక సర్జన్లు డాక్టర్ దుర్గా గణేష్, డాక్టర్ వరుణ్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సతీష్, బృందం సభ్యులు, కార్డియాలజి, యూరాజీ వైద్యులు పాల్గొన్నారు.



బంగ్లా షెడ్లను ప్రారంభించిన జెడ్పీటీసీ



తలమడుగు : మండలంలోని అర్లి, సుంకిడి గ్రామాల్లో రూ.15లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన బంగ్లా షెడ్‌లను బుధవారం జడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణ లక్ష్మిరాజేశ్వర్ ప్రారంభించారు. సుంకిడి గ్రామంలో రూ. 10 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులతో పూర్తయిన సవారి బంగ్లా షెడ్‌ని ప్రారంభించి అనంతరం అదే గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రేయర్ బ్యాండ్‌ను జెడ్పిటిసి, ఎంపీపీ తమ సొంత డబ్బులతో పాఠశాలకు అందజేశారు. మాజీ ఎంపీ సోయం బాపురావు, కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాబన్న, ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, వెంకన్న యాదవ్, మాధవ్, కో ఆప్షన్ మెంబర్ బాబుఖాన్, పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్, మాజీ సర్పంచులు కిష్టన్న, మహేందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు గోక భూమారెడ్డి, ప్రకాష్‌రావు, వెంకటేష్, అశోక్, ప్రవీణ్‌రెడ్డి, సాంబశివ్, వెంకట్‌రెడ్డి, రాకేష్, విలాస్ యాదవ్, గణేష్, సుభాష్, చెన్నల సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాక్టికల్స్ నోట్స్ పంపిణీ



కాసిపేట : మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రూ.4000తో ప్రాక్టికల్స్ బుక్స్ బెల్లంపల్లి మండలం సోమగూడెంకు చెందిన కందికట్ల మల్లేశ్ స్మారకార్థం కుమారుడు కందికట్ల రాంప్రకాశ్, సోమగూడెం పేరాల నారాయణ స్మారకార్థం కుమారుడు పేరాల మహేశ్ పంపిణీ చేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి ఏడు చొప్పున విద్యార్థులందరికీ ప్రాక్టికల్స్ బుక్స్ అందించడంతో పాటు పాఠశాలలోని ఇతర తరగతుల విద్యార్థులందరికీ పెన్నులను అందించారు. ఈ మేరకు దాతలు కందికట్ల రాంప్రకాశ్, పేరాల మహేశకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్, ఉపాధ్యాయులు పుష్పలత, శాంకరీ, జ్యోతి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, తిరుపతి, చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

15నుండి హెవీ మోటార్ వెహికిల్ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టిఎస్ఆర్టిసి డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ శిక్షణ జులై 15 నుండి ప్రారంభం కాబోతోందని డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30రోజుల పాటు ఉంటుందని, ఫీజు రూ:15600 చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్కె యూసుఫ్ సెల్ 7382840349ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టు అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్



మండలంలోని పాత ఎల్లాపూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రూ. పదివేల విలువైన టైలు, బెల్టులు ఉచితంగా అందజేశారు. సామ వంశీ, సామ లక్ష్మీనారాయణ, సామశంకర్ వారి తాతలు దివంగత సామలింగయ్య, సామ బుచ్చయ్య, సామ రాజయ్యల జ్ఞాపకార్థం పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అసూరి రమాదేవి, రాజ గంగు ఉన్నారు.

కాంగ్రెస్ గూటికి మరో ఇద్దరు కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఇటీవలే ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం తాజాగా మరో ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు బండారు సతీష్, 44వ వార్డు కౌన్సిలర్ షహనాజ్ బేగం తనయుడు ఇమ్రాన్ కాంగ్రెస్‌లో చేరారు. తాజా చేరికలతో కాంగ్రెస్ పార్టీ బలం 18కి పెరగ్గా, బీఆర్ఎస్‌కు వరుస షాకులు తగిలి బలం తగ్గుతోంది. కార్యక్రమంలో కౌన్సిలర్ కలల శ్రీనివాస్, నాయకులు డేరా కృష్ణారెడ్డి, అఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-కడెం



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని నర్సాపూర్ గ్రామ శివారులో దేవునిగూడెం గ్రామానికి చెందిన బుచ్చన్న మంగళవారం సాయంత్రం సమయంలో తన ఎక్సెల్ వాహనంపై వెళ్తుండగా మెట్‌పెల్లికి చెందిన కానకాటి రవీందర్ కారు(టీఎస్16ఈఏ4949)తో ఢీ కొట్టడంతో బుచ్చన్న కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 9 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని బుచ్చన్న కొడుకు గుజ్జుల తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

నేడు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్



నవతెలంగాణ-నిర్మల్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పత్రాల లీకేజీని నిరసిస్తూ గురువారం దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలన్నారు. ఎన్‌డీఏను రద్దు చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేజీ టూ పీజీ విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలన్నారు. ఈ బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.దిగంబర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఏ.రాకేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వి.మహేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎస్.కైలాస్, నాయకులు ఎస్.వెంకటేష్, కిరణ్, శ్రావణ్, తజుద్దీన్, అబ్దుల్ అద్నాన్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 8మంది విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ- తాంసి

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. షిండే మనిషా, గడ్డం దీప్తి, గోలి శరణ్య, పూదరి గంగోత్రి, ఆర్పెల్లి నాగబిందు, కామెర హర్షిత, పెరిమెల మేఘన, పులి శరణ్యలు బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించారు. అత్యధికంగా ఒకేసారి ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నిర్మల్

నియోజకవర్గంలోని నిర్మల్ అర్బన్, రూరల్, సోన్, దిలవార్‌పూర్, నర్సాపూర్ మండలాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు ఎమ్మెల్యే, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, సోన్ ఎంపీపీ మానస హరీష్ రెడ్డి, నాయకులు సరికెల గంగన్న, మార గంగారెడ్డి, అశోక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మరువలేనిది

నవతెలంగాణ-దాస్తురాబాద్

ఉపాధ్యాయ వృత్తి మరువలేనిదని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుచనపెల్లి వెంకట లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని మున్యాల ప్రాథమిక పాఠశాలలో బుధవారం నరసయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు రమణ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా విలువలతో కూడుకున్నదని, సమాజ అభివృద్ధికి ఎంతో మందిని తయారుచేసే మహోన్నత స్థానమే ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం గంగాధర్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కోట వేణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తం రెడ్డి, మున్యాల పాఠశాల హెచ్ఎం వామన్ రావు, ఉపాధ్యాయులు బ్రహ్మచారి, మల్లేశం, వెంకట్‌రాజం, మల్లేష్, కోటేష్, నవీన్, కడెం, ఖానాపూర్, జన్నారం మండలా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఉట్నూర్(బి) ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. బుధవారం పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. పాఠశాల వసతులో ఎలాంటి మారమ్మత్తులు చేపట్టానందున హెచ్ఎంపై ఆగ్రహించారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్లు పెంచివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట ఎన్‌పీఆర్‌డీ నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు పెన్షన్‌లను పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆత్రం నగేష్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆత్రం నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ. మూడు వందలను పెంచి రూ.3 వేలు ఇవ్వాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూ. ఆరు వేల పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వ వాటా రూ.300 ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచి ఇవ్వాలన్నారు. దివ్యాంగుల సమస్యలను గుర్తించి ప్రభుత్వాలు వాటిని పరిష్కరించేలా చూడాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా కార్యదర్శి ఆరిఫా, కోశాధికారి అనసూయ, జిల్లా సభ్యులు పోచ్చన్న, విజయ్ పాల్గొన్నారు.

ఆదివాసులపై ఆదివాసులను రెచ్చగొట్టడం సరికాదు

- ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు

నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క కార్యక్రమాల్లో జరిగిన ప్రోటోకాల్ వివాదాన్ని ఆసరా చేసుకొని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు విశ్వ ప్రసాద్ ఆదివాసీ ఎమ్మెల్యే కోవలక్ష్మిపై ఆదివాసీ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణతో ఆరోపణలు చేయించడం సిగ్గుచేటని ఎంపీపీ పంద్ర జైవంత రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ఆదివాసీ నాయకులు సెడ్మకి సీతారాం, సిడాం సోనేరావుతో కలిసి మాట్లాడారు. ఆదివాసీ ఎమ్మెల్యే లక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికావన్నారు. ఏజెన్సీ గ్రామాలలో డీసీసీ అధ్యక్షుడి జోక్యం తగదన్నారు. గతంలో పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రోటోకాల్ పాటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విస్మరిస్తున్నారన్నారు. ఓడిపోయిన అభ్యర్థులకు ఇన్‌చార్జీ బాధ్యతలు ఎలా ఇస్తారని, అధికారిక కార్యక్రమాలకు ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే



కోవ లక్ష్మి దిష్టిబొమ్మ దగ్ధం చేయడం సరైంది కాదన్నారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటాలు చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఆత్రం తిరుపతి, పంద్రం మణిక్ రావు, ఆనంద్ రావు, దూట మహేందర్, మరుసుకోల దేవ్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు

- జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

పశువులకు వ్యాధులు రాకుండా ప్రభుత్వం పశువైద్యశాఖ నుంచి అందించే ఉచిత టీకాలను వేయించాలని జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆర్లి(కె) గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్‌తో ఆయన పాల్గొని మాట్లడుతూ పవుశుల్లో లంపి స్కిన్ వ్యాధి వైరస్ వల్ల అనేక మూగ జీవాలకు ప్రాణాల ముప్పు ఏర్పడుతుందన్నారు. వాటిని గుర్తించి దగ్గరలోని ప్రభుత్వ పశు వైద్య ఆస్పత్రులకు తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అనేక రోగాలకు గురై పశు సంతతి రోజురోజుకు అంతరించిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లంపి స్కిన్ వ్యాధి ఒక పశువు నుండి మరో పశువుకు సోకే అవకాశం ఉన్నందున వెంటనే లక్షణాలను గుర్తించి వైద్యం చేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కిష్టన్న, ఎంపీటీసీ సుస్మిత రమేష్ రెడ్డి, పశు వైద్య అధికారి దూద్ రామ్ రాథోడ్, సిబ్బంది స్వామి, సౌమ్య, విజయ్, సుదర్శన్, గోపాల మిత్రలు రాజు, గంగన్న, జంగు, సాయి, కుమార్ పాల్గొన్నారు. అనంతరం జడ్పీటీసీ, ఎంపీపీ, మాజీ సర్పంచ్ కిష్టన్న పదవీకాలం ముగియడంతో పశు వైద్య సిబ్బంది వారికి శాలువా కప్పి సన్మానించారు.

హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేవైఎం అధ్యక్షుడు దాతాజీ కిరణ్ కోరారు. బుధవారం తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు నిరుద్యోగులు మోసానికి గురయ్యారని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మాయ మాటలు చెబుతూ మోసం చేస్తుందన్నారు. 25 వేలతో మెగా డీఎస్సీని వేయాలన్నారు. మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా మండల అధ్యాషుడు గోడెం భుజాంగరావు, పొట్టిపెల్లి శ్రీను, పురుషోత్తం, శివకృష్ణ, హేమంత్‌రావ్, ఆకాష్, పాల్గొన్నారు.



ఉపాధి హామీ డబ్బులు జమ చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఉపాధి హామీ డబ్బులు కూలీల ఖాతాలో వెంటనే జమ చేయాలని దళిత జిల్లా నాయకులు మోటేరావ్ అనిల్, మేడిగూడ గ్రామ కూలీలు అన్నారు. గాదిగూడ మండలంలోని 25 గ్రామ పంచాయతిలో మే నెల నుంచి ఇప్పటి వరకు రెండు నెలలుగా కూలీలు పనులు నిర్వహించారన్నారు. మూడు నాలుగు వారాల డబ్బులు పడలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ఉపాధి హామీపై అధికారులు స్పందించి కూలీల ఖాతాలో డబ్బులు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపెల్లి(జి) మాజీ సర్పంచ్ కొట్నాక్ బారిక్ రావ్, డోర్లె మురహరి ఉన్నారు.

పాఠశాలలో కేబినెట్ ఎన్నికలు

- బరిలో 50మంది, ఓటింగ్‌లో 900 మంది
- పర్యవేక్షించిన వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని లిటిల్ స్టార్ పాఠశాలలో బుధవారం పాఠశాల కెబినేట్ ఎన్నికలను నిర్వహించారు. ఈ పాఠశాలలో ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించి హెడ్ గర్ల్, బాయ్, అసిస్టెంట్ హెడ్ గర్ల్, బాయ్‌లను ఎన్నుకుంటారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఎన్నికలు నిర్వహించి 4 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఓటు ద్వారా స్కూల్ లీడర్లను ఎన్నుకున్నారు. ఓటింగ్ విధానంలో 4 నుంచి 10వ తరగతి విద్యార్థులు అభ్యర్థులను ఎన్నుకున్నారు. హెడ్ గర్ల్, బాయ్ పది, పదవ తరగతి విద్యార్థులను, అసిస్టెంట్ లీడర్లుగా 9, 4వ తరగతి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్యూలో నిల్చుని బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం సాధారణ ఎన్నికలను తలపించింది. ఈ ప్రక్రియను పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వరూప, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కెబినేట్ ఓటింగ్ ను గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. పోటీలో 56 మంది బరిలో ఉన్నారని, 800 మంది ఓటింగ్ లో పాల్గొన్నారని తెలిపారు.

ఆ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం నిర్వహించిన ప్రస్తుత బదిలీలలో బదిలైన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్ జాదవ్ అశోక్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్గత రేషనలైజేషన్‌తో ఎస్జీటీ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. రేషనలైజేషన్‌తోనే బదిలీలు నిర్వహించి, బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య, రిలీవర్ పేరుతో నిలువరించడం సరికాదన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, తగినంత మంది విద్యా వాలంటీర్లను నియమించి, బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కాలుష్యాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణలో ఎంతగానో దోహదపడే మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విజేత పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు లేకపోతే మానవజాతి మనవడకే ప్రమాదమున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వృక్ష సంపదను కాపాడుకోవాలన్నారు. సమస్త మానవాళికి ప్రాణవాయువు అందించగలిగేవి మొక్కలు మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల సబ్ సెంటర్ పరిధిలోని గుంజాల, సోంజీగూడ గిరిజన గ్రామాల గర్భిణులు, చిన్నారులకు బుధవారం సూపర్‌వైజర్ చరణ్ దాస్ వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గర్భిణీలకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేసుకునేల ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌పీ హేమబిందు, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరి, వైద్య సిబ్బంది విద్యారాణి, అంగన్వాడీ టీచర్ జయశీలా, అంజనబాయి, ఆశా సత్యశిల ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూరు గ్రామానికి చెందిన ఆడేపు శ్రీనివాస్ తల్లి మరణించడంతో బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, ఆడేపు శ్రీనివాస్ పరామర్శించారు. బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లిలి వారి కుటుంబాలను పరామర్శించి మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు, నాయుడి రవి, పాల శంకర్, కుంట శంకర్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | జులై 04, 2024 | www.navatelangana.com

రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వట్టివాగు ప్రాజెక్టు సాగు నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. బుధవారం వట్టివాగు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఇరిగేషన్ అధికారులతో కలసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వట్టివాగు ప్రాజెక్టు నీటిని సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో రైతులు వరి నాట్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉయిక శంకర్, నాయకులు గాజుల సత్యనారాయణ, వెంకన్న, కాంతారావు ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత బస్ పాస్‌లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో వికలాంగులకు 50శాతం ఉచిత బస్సు ప్రయాణానికి ఎంపీడీఓ కోట ప్రసాద్, వికలాంగుల జిల్లా అధ్యక్షులు రవిశంకర్ నేతృత్వంలో పాసుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వికలాంగుల జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రతి సంవత్సరం వికలాంగులను గుర్తించి బస్సు పాసులను రెన్యువల్ చేయకుండా, నిరంతరంగా పనిచేసేల వెసులుబాటు కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుండి ఇల్లు వచ్చే విధంగా చూడాలన్నారు. 31 మంది పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు జుమిడి పెంటయ్య, దుర్గం తులసీరం, ఐకేపీ సిబ్బంది, ఎంపీఓ గోవర్ధన్ సింగ్, వికలాంగులున్నారు.

ప్రజాసేవలో అంకితభావంతో పని చేయాలి


సిర్పూర్(టి)


చింతలమానేపల్లి



కౌటాల

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రజల చేత వెనుకబడిన సభ్యులు వారి సేవలో అంకితభావంతో పనిచేస్తే ప్రజలలో గుర్తింపు వస్తుందని ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు, కోఆప్షన్ సభ్యులకు మండల అభివృద్ధికి సహకరించి ప్రజలకు అందుబాటులో ఉండి చేసిన సేవలను కొనియాడారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడిన వారు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే మంచి నాయకునిగా మన్ననలు పొందుతారని అన్నారు. సహకరించిన అధికారులకు ధన్యవాదలు తెలియజేశారు. అనంతరం సన్మాన ఏడుగురు ఎంపీటీసీలను పంచాయతీ శాఖ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, సూపరింటెండెంట్ వాణి, ఏపీఓ చంద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ బండి సదాశివ్, జూనియర్ అసిస్టెంట్ రాజకుమార్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందన సభ ఎంపీడీఓ కోట ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ డుబ్బులు నానయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. అనంతరం సభను ఉద్దేశించి డిప్యూటీ తహసీల్దార్ మస్కుర్ అలీ, ఎంపీడీఓ కోట ప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా మండలం ఏర్పాటైన అనంతరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల పంచాయతీ అభివృద్ధి బాటలో నడిపించడానికి మండల నాయకులుగా డుబ్బుల నానయ్య కృషి ఎంతో ఉందన్నారు. మారుమూల గ్రామాలలో పాఠశాలలు, దినస్థితిలో ఉన్న భవనాలు సరైన ఉపాధ్యాయులు లేక, ఆయా గ్రామాలలో పాఠశాలలు కార్పొరేట్ పూర్తిస్థాయిలో తీర్చిదిద్ది పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అనంతరం సభ్యులను సత్కరించి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, వైస్ ఎంపీపీ మనజిత్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ నాజి హుస్సేన్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైరాజ్, సీడీపీఓ వడాయి శంకరమ్మ, ఏపీఓ గోవర్ధన్ సింగ్, నాయకులు డుబ్బుల వెంకన్న, చప్లె సుధాకర్ ఆయా గ్రామ కార్యదర్శులున్నారు.

కౌటాల : మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సహకారంతో మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాలుగా మండల అధికారులు అందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని విధాల అభివృద్ధి చేందెందుకు ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అందించారన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోనే కౌటాల మండలాన్ని ఒక ప్రత్యేక మండలంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం ఉందన్నారు. ప్రజలకు అవసరమగు అన్ని సౌకర్యాల కల్పన, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర వేసేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రజలతో మమేకమై సేవలందించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం సభ్యులను సత్కరించారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ డోకే రోజా రమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ రోజా రమణి మాట్లాడారు. మండల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఐదు సంవత్సరాల పదవి కాలంలో మండలాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. అనంతరం ఎంపీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు పలికారు. సందర్భంగా ఎంపీపీ రోజా రమణి, జడ్పీటీసీ పుష్పలత, మండల కో ఆప్షన్స్ సభ్యులు బషరత్ ఖాన్, ఎంపీటీసీలకు ఎంపీడీఓ మాధవి ఆధ్వర్యంలో అధికారులు పూలమాలలు, శాలువాలు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ రమేష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, వైస్ ఎంపీపీ జ్యోతి, ఎంపీటీసీలు లంగారి శ్రీనివాస్, పర్వీన్ సుల్తానా, ఆత్రం సాయి, గురజాల వెంకన్న, వ్యవసాయ అధికారి రాజుల నాయుడు, ఎంఈఓ రమేష్ బాబు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పుల్లూరి సతీష్, డోకే వెంకన్న, మహేష్, నరేందర్ గౌడ్, జావీద్ అలీ, రేణిగుంట్ల పెంటయ్య కొట్రంగి రామకృష్ణ, గ్రామపంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ మండల ఎంపీటీసీ సభ్యులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా పరిషత్ ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు పదవుల్లో లేకపోయినప్పటికీ అధికారులు ప్రజా సమస్యలపై శ్రద్ధ పెట్టి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. 2019 నుండి ఎంపీటీసీలు పదవుల్లో కొనసాగుతుండగా జూలై 2024తో వారి పదవి కాలం పూర్తికావస్తోంది. దీంతో మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు ఎంపీటీసీలను సన్మానించారు. సర్వసభ్య సమావేశంలో ఎలాంటి సమస్యలపై చర్చించకుండానే సన్మానాలతోనే పూర్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, ఎంపీడీఓ రమేశ్, ఎంపీఓ గౌరీశంకర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంలో పదవీకాలం ముగిస్తుండడంతో మాజీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంబగౌని సులోచన, జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారావుతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులతో పాటు మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జడ్పిటిసి సభ్యులు అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపి మల్లికార్జున్ ల పదవీకాలం పూర్తి కానున్న సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.ఉదయ్ బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. జెడ్పిటిసి అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ లు సందర్భంగా మాట్లాడుతూ క్రీడా మైదానానికి ప్రహరీ నిర్మాణం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కిషన్ రావు, ప్రకాష్,రవీందర్ లకు వీడ్కోలు, బదిలీపై వచ్చిన విజేష్, స్వప్నభారతి, ప్రవీణ్ లకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. సన్మానించి ఆత్మీయ అనుబంధాన్ని పంచుకున్నారు. అంతకుముందు ప్రముఖులు పాల్గొనగా పాఠశాల క్రీడామైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మయ్య, ఉమాబాల, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.


బెజ్జూర్


కాగజ్‌నగర్ రూరల్


ఆసిఫాబాద్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వికలాంగుల పెన్షన్ రూ.6000లకు పెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని వికలాంగ హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు పండుగ రాజేష్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రూ.300లను 3000లకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ రూ.6000లకు పెంచాలన్నారు. 2024 జనవరి నుండి పెరిగిన పెన్షన్ అమలు కావడం లేదన్నారు. వెంటనే దానిని అమలు చేయాలని కోరారు. పెన్షన్ పంపిణీ ప్రతినెల 5వ తేదీలోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఆసరా పెన్షన్ పొందడానికి 2014లో జారీ చేసిన జీఓ నెంబర్ 17 రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జాకీర్, సప్తగిరి రెడ్డి, సహాయ కార్యదర్శులు లక్ష్మి గౌతరే రాజు, పాలక్ రావు జాడి, కమిటీ సభ్యులు కళ్యాణ్, అంకన్న పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థుకు అవగాహన



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మహమ్మారి కరోనా అనంతరం విద్యార్థుల చేతుల్లో ఆండ్రాయిడ్ ఫోన్లు ప్రతి ఇంట్లో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ పేమెంట్, ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం, ఇతరాత్రా వాటి ద్వారా ప్రతి పేమెంట్స్ ఫోన్ ద్వారా జరుపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేస్తే డబ్బు వెనక్కి వస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జైరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్


S.THIROJA M.MANASWINI G.BHAVANA

జిల్లా కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. బుధవారం ఆర్జేయూకేటి విడుదల చేసిన ఎంపిక జాబితాలో మోడల్ స్కూల్‌కి చెందిన సోనులె తిరోజ, మసాదే మనస్విని, గుండేటి భావన ఎంపికైనట్లు పేర్కొన్నారు. ముగ్గురు విద్యార్థులు కూడా ఈ ఏడాది పదవ తరగతిలో 9.8 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

వారాంతపు సంత వేలం రూ.2.20 లక్షలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ఆదివారం నిర్వహించే వారాంతపు సంతనూ బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో బెజ్జూరుకు చెందిన మేరాజ్, సిరాజ్, సామల వెంకటేశ్ పాల్గొన్నారు. బెజ్జూరు వారాంతం సంతను సామల వెంకటేష్ రూ. రెండు లక్షల ఇరవై వేలకు దక్కించుకున్నట్లు బెజ్జూరు గ్రామపంచాయతీ కార్యదర్శి పెదం తుకారం తెలిపారు. ఈ వేలం మార్చి వరకు కొనసాగుతుందని తెలిపారు.

యువకుల శ్రమదానం



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని గోల్కొండ కాలనీలో ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిల్వ కారణంగా బురదగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. దీనిని గమనించిన గ్రామ యువకులు రెండు ట్రాక్టర్లతో మొరం వేయించి అందరూ కలిసి శ్రమదానం చేశారు. దీన్ని గమనించిన గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మల్లెల శ్రీకాంత్, షాకీర్ హుస్సేన్, మోయిన్ ఖాన్, జహీద్ ఖాన్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 5న మండలంలోని భట్టుపల్లి సమీపంలోగల పటేల్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే వర్గీయులు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ గౌడం నగేష్ ఉదయం 10 గంటలకు శిబిరాన్ని ప్రారంభిస్తారని, రక్త దాతలకు రూ. లక్ష ప్రమాద బీమా కల్పించడం జరుగుతుందని, దాతలు ఆధార్ కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఏడు నెలల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ సవాల్
- ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేపై పెత్తనమేంటీ..?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో జిల్లాలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిపై అంబేద్కర్ చౌక్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా అని ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకుల పెత్తనం ఏంటని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ప్రశ్నించారు. మంగళవారం కాంగ్రెస్ నాయకుల నిరసనను ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుడికి నేరుగా తనను ఎదుర్కొనే ధైర్యం లేక ఆత్రం సుగుణను ముందు ఉంచి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు. ఏడు నెలల కాలంలో చేసిన అభివృద్ధి పై చర్చకు సిద్ధమ అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో తనకు ఉన్న ఆదరణ చూసి ఓర్వలేని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కక్షపూరితంగా వ్యవహరిస్తూ తన అనుచర గణాన్ని బెదిరింపులకు గురి చేయడంతో పాటు కేసులు నమోదు చేయిస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సీతక్క ఇప్పటివరకు తనను కించపరిచేలా మాట్లాడలేదన్నారు. ఆత్రం సుగుణ దొరల చేతిలో బంది అయిందన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఏడు నెలల కాలంలో గతంలో మంజూరైన పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం మినహా చేసిందేమీ లేదన్నారు. దమ్ముంటే అభివృద్ధి పనులు తీసుకువచ్చి మాట్లాడాలన్నారు. ఆత్రం సుగుణను అడ్డుపెట్టుకొని దిష్టిబొమ్మ దహనం పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టడం ఇలాంటివి చేయడం ఏంటని ప్రశ్నించారు. తమ పార్టీ కార్యకర్తలను తూలనాడిన జిల్లా అధ్యక్షుడు కార్యకర్తల తల్లుల కాళ్లు పట్టుకుని క్షమాపణ చెబితే తాను కూడా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌తో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్యాం నాయక్ తల్లుల కాళ్లు పట్టుకొని క్షమాపణ అడుగుతానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఆదివాసుల మధ్య చిచ్చుపెట్టే కుట్ర జరుగుతోందని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. పది సంవత్సరాల తమ ప్రభుత్వ పాలనలో కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టడం కానీ, వారిని ఇబ్బందులకు గురి చేయడం కాని చేయలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నామని చిల్లర రాజకీయాలు చేసి బెదిరింపులకు గురి చేస్తే భయపడేది లేదని హెచ్చరించారు. జిల్లా నాయకురాలు సరస్వతితో పాటు పలువురు ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోవలక్ష్మీ దిష్టిబొమ్మను ఆత్రం సుగుణ చెప్పులతో కొట్టడం ఆదివాసీ సాంప్రదాయాన్ని ధిక్కరించడమేనని భవిష్యత్తులో దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో అగ్రవర్ణాల చేతిలో ఆదివాసులు కీలుబొమ్మలుగా మారకూడదని సూచించారు. సమావేశంలో నాయకులు బుర్స పోచయ్య, పుష్పలత, నర్సింగ్ రావు, కనక యాదవరావు, అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణ లక్ష్యాన్ని చేరుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా అధికారులు, బ్యాంకర్లతో రుణ ప్రణాళిక విడుదల చేసి జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం 100 శాతం రుణాలను రైతులు, మహిళా సంఘాలు, అర్హులైన లబ్ధిదారులకు అందించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక చేయూత అందించడం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల స్కీములు సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులు రుణాలు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా బ్యాంకర్లు, అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ పంట రుణాలను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ శాఖల ద్వారా రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చేపల పెంపకం, డైరీ ఫార్మ్ కోళ్ల పెంపకం, క్యాంటీన్లు, కుట్టు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ రుణాలు అందించడానికి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి సాయి తేజరెడ్డి, నాబార్డ్ డీడీ ఎం. వీరభద్రుడు, ఎల్‌డీఎం రాజేశ్వర్ జోషి, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సింగరేణికే బొగ్గు బ్లాకును కేటాయించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థకే శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేటాయించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఖైరగూడ ఓపెన్‌కాస్ట్ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సింగరేణిని ప్రయివేటీకరించేందుకు బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తు సంఘం పిలుపు మేరకు ఈనెల 5 నుంచి 18వ తేది వరకు నిరసనలు తెలిపాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు సముద్రాలు ఆనంద్, శేషశైనారావు, కే కిరణ్ బాబు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో...

బొగ్గు బ్లాక్ ల వేయడానికి వ్యతిరేకంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. బొగ్గు బ్లాకులను సింగరేణికే నామినేషన్ పద్ధతిపై కేటాయించాలని, కమర్షియల్ మైనింగ్ పేరిట వేలం వేయడాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్షిప్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మాల్రాజ్ శ్రీనివాసరావు, సెంట్రల్ కమిటీ నాయకులు ధరావత్ మంగీలాల్, ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, నాయకులు సుగ్రీవులు, దేవేందర్, బొంగు వెంకటేష్, మారుతి, ఖలీముల్లా ఖాన్, సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.



బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని భట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయుల బృందం సన్మానించింది. విద్యార్థులు నృత్యాలు, కోలాటం ఆడుతూ స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు కరుణాకర్, శాంతికుమార్, నరేందర్, సత్యనారాయణ, మధురాణి, అన్నపూర్ణ, నాగేశ్వర్‌రావు, రవుఫ్, కవితరాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | జులై 04, 2024 | www.navatelangana.com

మాజీ సర్పంచ్ సంగీతరావు మృతి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కొత్తపెల్లి మాజీ సర్పంచ్, ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు చీమల సంగీతరావు బుధవారం మృతి చెందారు. ఆయన అకాల మరణం పట్ల వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంగీతరావు కాంగ్రెస్ పార్టీకి తాండూరు మండలానికి సింగరేణి కార్మికులకు ఎనలేని సేవలందించారు. మండలంలో లయన్స్ క్లబ్ ఏర్పాటుకు కృషి చేశారు. ప్రతి వారం లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నా కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శనివారం అంగడి ఆయన హాయంలోనే ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్‌రావు, ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్. సీనియర్ నాయకులు మాజీ సింగిల్ వైస్ చైర్మన్ సూరం దామోదర్‌రెడ్డి, షేక్ అహ్మద్ మామిడాల రాజేష్, తోట శ్రీనివాస్ సంగీతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం



సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెకండ్ ఎస్ఐ సర్కార్ సూచించారు. బుధవారం ధర్మారంచౌరస్తాలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. స్మార్ట్‌ఫోన్‌కు వచ్చే అనవసర మెస్సేజులకు స్పందించవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పవద్దని ప్రజలను ఆయన కోరారు.

బొగ్గు బ్లాకుల వేలం పాటను వ్యతిరేకించాలి

- 5 నుంచి 12 వరకు సీపీఐ, ఏఐటీయూసీ ఆందోళన కార్యక్రమాలు
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ ప్రాంతంలో గల బొగ్గు గనుల వేలం పాటలను వ్యతిరేకించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఇందారం-1ఏ గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో సింగరేణి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. బొగ్గు గనుల వేలంకు వ్యతిరేకంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5 నుండి 12 వరకు ఆంధోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2015 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టాన్ని మార్చి దేశంలో ఉన్న నూతన బొగ్గు గనులను ప్రభుత్వరంగా సింగరేణి, కోలిండియా కాకుండా ప్రయివేటు వారికి వేలం ద్వార కట్టబెట్టేందుకు నిర్ణయం తీసుకుందని అన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఎంఎంఆర్‌డీ బిల్లుపై బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. నామినేషన్ ద్వార తెలంగాణలో గల బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వకుండా ఎంఎంఆర్ బిల్లు తీసుకొచ్చారని తెలిపారు. తెలంగాణ బిడ్డగా కేంద్ర మంత్రి పదవిలో ఉన్న కిషన్‌రెడ్డి ఇక్కడి బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి దక్కే విధంగా కృషి చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీతో మిలాఖత్ అయి సింగరేణికి దక్కాల్సిన 4 బొగ్గు బ్లాకులను తన అనుయాయులకు చెందే విధంగా సింగరేణిని వేలంలో పాల్గొనకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని అన్నారు. వేలంలో దక్కించుకున్న రెండు బొగ్గు బ్లాకులు కోయదూడెం ఓపెన్‌కాస్ట్-3, సత్తుపల్లి ఓసీపీని బీఆర్ఎస్‌కు చెందిన అరబిందో, అవంతిక అనే ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టగా ఇప్పటి వరకు సదరు బొగ్గు బ్లాకులు ప్రారంబించకపోవడం గమనార్హం అన్నారు. ఈ క్రమంలో వాటి వేలం పాటను రద్దు చేయడంతో మిగితా గనులను సింగరేణికి ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందని అన్నారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులు వేలం వేయకుండా సింగరేణికి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్తంగా ఆంధోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఈ నెల 5న జిల్లా కలెక్టర్ కార్యాలయ వద్ద భారీ ఎత్తున ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా జూలై 8 నుండి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ ఆఫీసుల మందు రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. తెలంగాణలో నూతన బొగ్గు గనులు సింగరేణికి దక్కాలంటే ఈ ఆందోళన కార్యక్రమాలల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, కోశాధికారి నాగభూషణం, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ఇక్బాల్ హుసేన్, బాలకృష్ణ, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.



కాసిపేటలో..

మందమర్రి : బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని మందమర్రి ఏరియా కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ యూనియన్ నాయకులకు పిలుపునిచ్చారు. కెకె 5గని వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్ మాట్లాడుతూ బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 5వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు యూనియన్ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ సింగ్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి బానోతు నాగేశ్వరావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ప్రేమ్‌లాల్, గుమ్మడి సంపత్, సాంబా శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాసిపేట : బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 2వ గనిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ సెక్రటరీ ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ పాల్గొని మాట్లాడారు. బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయాలని, సింగరేణి సంస్థకు నామినేషన్ పద్ధతి ద్వారానే బొగ్గు బ్లాక్ లను ఇవ్వాలని, ఈ నెల 5న భారత కమ్యూనిస్టు పార్టీ, దాని అనుబంధ సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఇప్ప కాయ లింగయ్య, కాసిపేట-2వ గని పిట్ సెక్రటరి గొల్ల శ్రీనివాస్, మైనింగ్ వర్క్ మేన్ ఇన్స్‌పెక్టర్ సుభాష్ చంద్రబోస్, కొండపల్లి నరసయ్య, బొద్దుల వెంకటేష్, నీలయ్య, దేవులపల్లి శ్రీనివాస్, రాజ కొమురయ్య, సుర మల్ల వినయ్ కుమార్, వేణుగోపాల్, సుధాకర్, మహమ్మద్ అంజద్ ఖాన్, లింగమూర్తి శివ గౌడ్, అశోక్ పాల్గొన్నారు.



మందమర్రిలో..

నల్ల జెండాలతో సీపీఐ(ఎం) నిరసన

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని సోమగుడెం(కే), మల్కేపల్లి గ్రామాల్లో సీపీఐ(ఎం) అధ్వర్యంలో బొగ్గు బ్లాక్‌ల వేలం పాటను రద్దు చేయాలని, బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సంధర్బంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ బీజేపీ, మోడీ ప్రయివేటీకరణ విధానాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు కోరలు పికేసినా బీజేపీ, మోడీకి బుద్ధి రాలేదని, బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి సంకె రాజకుమారి, సిడం జంగు బాయి, సంకె లింగయ్య, సంకె ప్రణయ్ కుమార్, చాయ, చెన్నూరి శ్రీనివాస్, చిలుముల పోషం, సాపాట్ భాగ్య, పత్తిపాక మొగిలి, నాగమణి, సాపట్ మల్లేష్, సుజాత పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-తాండూర్

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని పంచాయతీలలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని రేచీని గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చూడాలన్నారు. తడి పొడి చెత్త సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలని తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించి కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువును తయారి విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కంపోస్ట్ ఎరువు తయారు ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఉత్పత్తి చేసిన వర్మీ కంపోస్టను హరితహారం మొక్కలకు వాడాలన్నారు. స్మశాన వాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంపీ ఓ అఖ్తర్ మోహియిద్దీన్ తో కలిసి మొక్కలు నాటారు.

సింగరేణి మిగులు విద్యుత్ బహిరంగ మార్కెట్‌లో విక్రయం

- ఎన్‌టీపీసీ-సింగరేణి మధ్య కుదిరిన ఒప్పందం

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న మిగులు విద్యుత్ బహిరంగ మార్కెట్‌లో విక్రయించనున్నట్లు సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఎన్‌టీపీసీ-సింగరేణి మధ్య బుధవారం న్యూ ఢిల్లీలో ఒప్పందం కుదిరిందని తెలిపారు.. సింగరేణి విద్యుత్ కేంద్రం ద్వార ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌లో రాష్ట్ర అవసరాలకు వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఎన్‌టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగం లిమిటెడ్-సింగరేణి కాలరీస్ కంపని లిమిటెడ్ మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలను ఎన్‌టీపీసీ తరుపున రేణు నారంగ్, సింగరేణి తరపున డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు పరస్పరం మార్చుకున్నట్లు వెల్లడించారు.. ఈ క్రమంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్ బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ఇదే మొదటి సారి అని పేర్కొంటూ బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ద్వార వచ్చిన లాభాలను రాష్ట్ర డిస్కంలు సింగరేణి కాలరీస్ సహానంగా పంచుకోవడం జరుగుతుందని డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ రావు తెలిపారు.

విరివిరిగా మొక్కలు నాటాలి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు విరివిరిగా నాటాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు అన్నారు. మండలంలోని పోతన్‌పల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వార కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మండలంలో గ్రామ వారిగా మొక్కలు నాటించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ జీనత్, ఈసీ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది గ్రామ పంచాయతి ప్రజలు పాల్గొన్నారు.

పంట సాగుకు అటవీ అధికారుల అడ్డు తొలగించాలి

- వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన బాధిత రైతు

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వ పంపిణీ చేసిన భూముల్లో పంటలు సాగుకు అటవీ అధికారుల అడ్డు తొలగించాలని పోలంపల్లి శివారు రైతు కోట శ్రీరాములు డిమాండ్ చేశారు. అటవీ అధికారుల తీరును నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో గల వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పోలంపల్లి శివారు సర్వే నెం.314(12), 384(14)లలో గల 10 ఎకరాలు కోట బాలమ్మ, కోట శంకరమ్మ ప్రభుత్వ పరంగా పట్టాపాసు బుక్ పొందినట్లు తెలిపారు. 2005 సంవత్సరం నుంచి పంటలు సాగు చేస్తున్న క్రమంలో 2010 సంవత్సరంలో ప్రభుత్వం పట్టాపాసు బుక్కు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా 2012 సంవత్సరంలో పంటల సాగును అడ్డగించిన అటవీ అధికారులు ఇది ప్రభుత్వ భూమి కాదు. పట్టా భూమి అంటూ అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు పంపిణీ చేసిన భూమిని అటవీ అధికారులు రక్షిత అటవీ ప్రాంతమని అడ్డుకోవడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ విషయమై 2013 సంవత్సరంలో అప్పటి తహసీల్దార్ టంకసాల రవిందర్‌రావుతో పాటు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, ఎంసీ అటవీ అధికారులతో తరలివచ్చి వాస్తవాలు పరిశీలించగా సదరు భూమి రక్షిత అటవీ ప్రాంతం కాదు ప్రభుత్వ భూమి అని తేలిందని ఆయన తెలిపారు. అయినప్పటికీ అటవీ అధికారులు అజమాయిషీ తప్పడం లేదని, 2013 నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరుగుతూ ప్రభుత్వ పరంగా పంపిణీ చేసిన భూమి పట్ల అటవీ అధికారుల అడ్డు తొలగించాలని వేడుకుంటున్నా స్పందించకపోవడంతో తప్పనిసరై వాటర్ ట్యాంక్ ఎక్కినట్లు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హెడ్‌కానిస్టేబుల్ మాచర్ల, ముత్తన్నలు భూసమస్యకు పరిష్కారం చూపిస్తామని అటవీ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులతో వాస్తవ పరిస్థితులను గుర్తించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సర్దుమనిగింది.

విద్యాధికారుల దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని కేరళ మోడల్ హైస్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నా అధికారులు పంట్టించుకోవడం లేదని బుధవారం ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యాధికారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. పుస్తకాలు అమ్ముతున్నారని తెలుసుకొని ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా యదేచ్ఛగా సాగుతుందని, నర్సరీ నుండి మొదలుకొని పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను పాఠశాల ఆవరణలోనే అమ్ముతున్నారని తెలిపారు. పుస్తకాలే కాకుండా యూనిఫామ్‌లు టై, బెల్ట్ కూడా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని ఆందోళన కార్యక్రమాలు చేసినా కూడా అధికారులు నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రుల దగ్గర నుండి ఫీజుల రూపంలో దోపిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు పాఠ్య పుస్తకాల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరించడంతో విద్యా సంస్థలతో అధికారులు లాలూచీ పడుతున్నట్లు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తల కాలను అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థుల సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, జాగిరి రాజేష్, జుమ్మిడి గోపాల్, షేక్ సల్మాన్, రేగుంట క్రాంతి, చీరాల వంశీ, బచ్చలి ప్రవీణ్ కుమార్, పురేళ్ళ నితీష్, శంకరి సత్యం, అభిరామ్, సిద్దార్థ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాక్టికల్స్ నోట్స్ పంపిణీ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రూ.4000తో ప్రాక్టికల్స్ బుక్స బెల్లంపల్లి మండలం సోమగూడెంకు చెందిన కందికట్ల మల్లేశ్ స్మారకార్థం వారి కుమారుడు కందికట్ల రాంప్రకాశ్, సోమగూడెం పేరాల నారాయణ స్మారకార్థం వారి కుమారుడు పేరాల మహేశ్ పంపిణీ చేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి ఏడు చొప్పున విద్యార్థులందరికీ ప్రాక్టికల్స్ బుక్స్ అందించడంతో పాటు పాఠశాలలోని ఇతర తరగతుల విద్యార్థులందరికీ పెన్నులను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్, ఉపాధ్యాయులు పుష్పలత, శాంకరీ, జ్యోతి, పల్లె కృష్ణ గోపాల్‌రావు, తిరుపతి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

- ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్



జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం

పదవిలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా గుర్తుండిపోతాయని ఎంపీపీ మాదాడి సరోజన జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీడీసీ సెంటర్‌లో మండల ఎంపీపీ పదవి కాలం పూర్తి అవుతున్న సందర్భంలో ప్రజా ప్రతినిధులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పదవిలో ఉండి ప్రజలకు ఎన్నో సేవలు అందించామన్నారు. జడీటీసీగా జిల్లా స్థాయి సమావేశాల్లో ఎప్పుడు మండలంలో 30 పడకల ఆస్పత్రి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ డిగ్రీ కళాశాల గురుకుల పాఠశాల ఏర్పాటు జడ్పీ సమావేశంలో మాట్లాడామన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేశామన్నారు. ఎంపీపీగా మాదాడి సరోజన, మండలం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు చేశామన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు వారి వారి అభిప్రాయాలను తోటి ఎంపీటీసీలతో పంచుకున్నారు. గడిచిన ఐదు సంవత్సరాలు ప్రజా శ్రేయస్సే పరమావధిగా పని చేశామన్నారు. అవకాశం ఉంటే మళ్లీ ప్రజలు గుర్తించి తమను ఎంపీటీసీలుగా ఇతర పదవులలో ఎన్నుకుంటే మళ్లీ మండల స్థాయి జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధుల వస్తామన్నారు. అనంతరం ఎంపీటీసీలను జడ్పీటీసీలను మండల అధికారులు శాలువ పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్ కోఆప్షన్ సభ్యులు అలీ ఖాన్, ఎంపీడీఓ శశికళ, ఏపీఎం రవీందర్, ఏపీఎం బుచ్చన్న పీఓపీఆర్టీ రమేష్ ఎంఈఓ విజయ్‌కుమార్, మిషన్ భగీరథ అధికారి అబ్రహం పాల్గొన్నారు.

జైపూర్ : గ్రామ పంచాయతీల పరిధిలో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల నిర్వాహణలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్ అన్నారు. ఐదు సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటున్న మండల పరిషత్ సభ్యులతో కలిసి బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు వీడ్కోలు పలికారు.



దండేపల్లిలో..

దండేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చివరి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన సమావేశానికి ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరయ్యారు. సమస్యలపై చర్చించి తమ అధికారంలో లేకున్నా మండల అభివృద్ధికి పాటుపడాలని సదురు ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత ఐదు సంవత్సరాలలో చేసిన ప్రగతి పనులపై నివేదికలు చదివి వినిపించారు. ఇకనుండి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని ఎంపీడీఓ జేఆర్ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, ఆయా గ్రామాల ఎంపీటీసీలను పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.



జైపూర్‌లో..

కాసిపేట : పదవీ కాలం ముగిసిన సందర్భంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అత్యవసర పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు పలికారు. సభ్యులకు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీపీ రొడ్డ లక్ష్మి, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కపల్లి లక్ష్మి, అట్టెపల్లి సుమలత, పర్వతి మల్లేశ్, మేరుగు పద్మ, భీంరావు, చంద్రమోళి, కోఆప్షన్ సిరాజుఖాన్ ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, సహకార చైర్మన్ నీలా రాంచందర్, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.



కాసిపేటలో..

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం

నవతెలంగాణ-రెబ్బెన



మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యమని షీ టీమ్ ఇన్‌చార్జీ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో షీటీమ్‌పై అంగాహన కల్పించారు. విద్యార్థులందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్ గాని వాట్సాప్ కాల్ గాని మాట్లాడవద్దని సూచించారు. సైబర్ మోసాలకు 1930, మహిళలు ఆపద సమయంలో డయల్100, షీ టీమ్ నెంబర్ 8712670564ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ రాణి, హెడ్‌కానిస్టేబుల్ సునీత, మహిళ కానిస్టేబుల్ శ్రీలత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన చట్టం కింద ఎమ్మెల్యేపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను కాంగ్రెస్ నాయకుడు కుడ్మేత విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కేసు నమోదు చేశామని సీఐ సతీష్ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడితో దుర్భాషలాడడం, ఇష్టం వచ్చినట్టు మాట్లాడి హెచ్చరించిన నేపథ్యంలో ఫిర్యాదు వచ్చిందన్నారు. దర్యాప్తు చేసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మిపై నూతన చట్టాలైన బీఎన్ఎస్ 351(2), 396(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పై కేసు నమోదు చేయడానికి ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరిని ఖండిస్తూ చేసిన నిరసనపై కేసు నమోదు చేయడం సరైన విధానం కాదన్నారు.

రాథోడ్ రమేష్ మరణం తీరని లోటు



నవతెలంగాణ-కడెం

మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేష్ అకాల మరణం తీరని లోటని బీజేపీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రమేష్ రాథోడ్ ప్రజలకు ఎమ్మెల్యేగా, ఎంపీగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా అనేక సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఇటీవల మరణించగా బుధవారం బంజారా దీక్ష గురువు, కొత్తపల్లి పీఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహరాజ్, బంజారా సంఘం జేఏసీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రమేష్ సేవలను కొనియాడారు. ఆయనతో పాటు మధుకర్, బాబులాల్, గోపాల్ రావు, రితేష్, రాహుల్, ధనలాల్, నరహరి, యశ్వంత్ రావు, నారాయణ్ పాల్గొన్నారు.

ఖానాపూర్ ఐసీడీఎస్‌పై శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని ఖానాపూర్ ఐసీడీఎస్‌పై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ బుదవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20 రోజులుగా ఖానాపూర్ సీడీపీఓ, అంగన్‌వాడీ కార్యకర్తకు సంబంధిచి పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి విచార చేపట్టాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-నిర్మల్

డయల్ యువర్ డీఎంను గురువారం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు, అదనపు బస్సుల సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. 9959226003 ఫోన్ నెంబర్‌కు చేసి నేరుగా మాట్లాడాలని పేర్కొన్నారు.

నేర్పించిన విద్యాబుద్ధులు మర్చిపోలేం

- ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-జైనథ్

మీరు నేర్పించిన విద్యాబుద్ధులు మేము మర్చిపోలేము, మీరు మాకు దైవంతో సమానమని విద్యార్థులు తమ ఉపాధ్యాయులను కొనియాడారు. మండలంలోని లక్ష్మీపూర్ జడ్పీఎస్ఎస్‌లో పనిచేస్తున్న తెలంగ్ గణేష్ ఉద్యోన్నతిపై గోట్కూరి పాఠశాలకు, మమత బదిలీపై ఖోడద్ పాఠశాలకు వెళ్తున్నారు. బుధవారం ఉపాధ్యాయులకు 2015-2016 బ్యాచ్ విద్యార్థులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆటపాటల ద్వారా విద్య నేర్పించిన తీరుతెన్నులను విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. చాలా రోజుల తర్వాత కలిసిన విద్యార్థులను ఇప్పుడు ఎం చదువుతున్నారు.. ఏ రంగంలో స్థిర పడ్డారని ఉపాధ్యాయుడు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ రాములు, ఉపసర్పంచ్ స్వామి, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు నారాయణ, రహీమ్, విద్యార్థులు సాయి, కార్తిక్, సంజయ్, యోగేష్, అక్షయ్, వీణ, ఐశ్వర్య ప్రవళిక పాల్గొన్నారు.

విద్యా శాఖ మంత్రి లేక అధ్వానంగా విద్యా వ్యవస్థ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్న ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదని, దీంతో విద్యావ్యవస్థ అధ్వానంగా మారిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. విద్యరంగ సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు కార్యాలయం గేటు ఎక్కి లోనికి వేళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. నాయకులను సముదాయించి ఐదుగురిని లోనికి అనుమతించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యశాఖ మంత్రి లేక విద్య వ్యవస్థ దారి తప్పుతుందన్నారు. సమస్యలు విన్నవించడానికి, చెప్పడానికి ఎవరు లేరన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్న ఇప్పటి వరకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యశాఖ మంత్రిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్ మడవర్ హరీష్, నాయకులు మహేష్, నిఖిల్, శివసాయి, కార్తీక్, ఉదయ్ పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ తల్లీకూతురు మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



అనిత(ఫైల్)



రమ్య(ఫైల్)

ప్రతీ కుటుంబంలో సమస్యలు ఉండటం సహజమే. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రధానంగా ఓ చెడు వ్యసనం ఫలితంగా ఓ కుటుంబమే చిన్నభిన్నమైంది. వివరాల్లోకి వెళితే కాగజ్‌నగర్ మండలంలోని గజ్జిగూడ గ్రామంలో చోటుచేసుకున్న హృదయ విదారకర ఘటనే ఇందుకు నిదర్శనం. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ముగ్గురు కూతుళ్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాలడ్పిన విషయం తెలిసిందే. సోమవారం పురుగుల మందు తాగి తల్లి అనిత, కూతుళ్లు లక్ష్మి, రమ్య, ఐశ్వర్యలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి అనిత(45), కూతురు రమ్య(18)లు బుధవారం మృతి చెందడంతో గజ్జిగూడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మిగతా ఇద్దరు కూతుళ్లు లక్ష్మి, ఐశ్వర్యలు సైతం ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. కుటుంబ నేపథ్యం చూసినట్లయితే వ్యవసాయ కుటుంబానికి చెందిన చిలుకూరి ప్రతాప్‌కు ఐదుగురు కూతుళ్లు. వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు తోడుకావడంతో మనో ధైర్యం కోల్పోయి తాగుడుకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో కూతుళ్ల చదువులకు చేతిలో చిల్లిగవ్వ లేక అప్పు సైతం ఎవరూ ఇవ్వడానికి ముందుకు రాకపోవడం ప్రతాప్ మానసిక ధైర్యం కోల్పోయాడు. అంతేకాకుండా ప్రతాప్ గతంలో తాగిన మైకంలో విచక్షణ కోల్పోయి గ్రామానికి చెందిన ఒకరిపై హత్యాయత్నం చేశారు. ఆ కేసులో నిందితుడైన ప్రతాప్‌కు జైలు శిక్ష విధించింది. ఇటీవల బెయిల్‌పై వచ్చిన ప్రతాప్ తన ప్రవర్తనలో మార్పు రాకపోగా, తాగిన మైకంలో కుటుంబీకులతో గొడవపడేవాడు. దీంతో విసిగిపోయిన భార్య, ముగ్గురు కూతుళ్లు పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పరిస్థితి విషమించడంతో తల్లి అనిత, కూతురు రమ్య ప్రాణాలు కోల్పోయారు. రమ్య 2023-24లో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ప్రవేశం లభించలేదు. మరో ఇద్దరు కూతుళ్లు లక్ష్మి, ఐశ్వర్య సైతం మృత్యువుతో పోరాడుతున్నారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు పంచనామా నిర్వహించారు. మృతి చెందిన తల్లి, కూతురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించారు.

పచ్చదనాన్ని పెంపొందించేందుకే వన మహోత్సవం



నవతెలంగాణ-జన్నారం

పచ్చదనాన్ని పెంపొందించేందుకే వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని మోర్రిగూడలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజాప్రతినిధులతో మొక్కలు నాటారు. మండలంలోని మోర్రిగూడలో మొదటిసారిగా వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే కోరారు. మొక్కలే మానవ మొనగాడకు జీవనాధారం అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి హరిత తెలంగాణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ దత్తారం, ఎంపీపీ మాదాడి సరోజన, ఎంపీడీఓ శశికళ, ఏపీఓ రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మాణిక్యం, నాయకులు రాజశేఖర్, దుర్గం గంగాధర్, మల్క లక్ష్మణ్, ముత్యం రాజన్న లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మందమర్రి : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వృక్షాలుగా అయ్యేంతవరకు సంరక్షించాలని జీఎం మనోహర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కెకె-2 బంగ్లా ఏరియాలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం మందమర్రి జీఎం మనోహర్, సేవా అధ్యక్షురాలు సవిత మనోహర్ ప్రారంభించారు. జీఎం మనోహర్ మాట్లాడుతూ కాలానుగుణంగా కోట్ల మొక్కలను నాటడం, పెంచడం, పంచడం లాంటి కార్యక్రమాలు చేపడుతూ పర్యావరణ పరిరక్షణలో సింగరేణి యాజమాన్యం భాగస్వామ్యం అవుతుందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి తమ ప్రాంతాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీజీఎం ఐఈడీ రాజన్న, డీజీఎం ఎఫ్అండ్ఏ ఆర్‌వీఎస్ ఆర్ కే ప్రసాద్, కేకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు పాల్గొన్నారు.

కాసిపేట : తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవంలో భాగంగా మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ అశీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అడవుల వలన కలిగే లాభాలను వివరిస్తూ, మొక్కలను పెంచడం బాధ్యతగా తీసుకోవాలని, కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ ఆవశ్యకత గురించి పడిన కష్టాలను తెలియజేశారు. విద్యార్థులు వనాలను పెంచడం ఆసక్తి చూపి భావి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజనల్ అధికారి విజయకుమార్, బెల్లంపల్లి అటవీ క్షేత్రదికారి సుభాష్, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, ఉపాధ్యాయులు పుష్పలత, శాంకరీ, జ్యోతి, కృష్ణగోపాల్, తిరుపతి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రి : మొక్కల నాటడంతో సకాలంలో వర్షాలు పడుతాయని మందమర్రి ఎంపీడీఓ రాజేశ్వర్ అన్నారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన వన మహోత్సవంలో ఎంపీడీఓ రాజేశ్వర్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి కడారి జీవన్, గ్రామ కార్యదర్శి గోపతి నరేష్‌లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని వాటి ద్వారా ప్రాణకోటికి ఆక్సిజన్ అందుతుందని, ఎండ వేడి తగ్గుతుందని, మొక్కల నాటడంతో సకాలంలో వర్షాలు పడతాయని, ప్రస్తుత వాతావరణ మార్పుకి మొక్కలు పెంచడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, స్కూల్ టీచర్లు సమైక్య వీఓలు, ఏఎన్ఎం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, మున్సిపల్ కమిషనర్లు, సానిటరీ ఇన్స్‌పెక్టర్స, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్లతో ప్లాస్టిక్ నిషేధం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను వాడకుండా వినియోగదారులకు విస్తత అవగాహన కల్పించాలని సూచించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ ని విక్రయిస్తున్న, నిల్వ చేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వినియోగించడం, విక్రయించే దుకాణదారులకు జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేయాలనీ, వ్యాపారాలకు సంబంధించిన లైసెన్సులను రద్దు చేయాలనీ ఆదేశించారు.

ప్రజాక్షేత్రంలో గుర్తింపు ఉంటుంది

నవతెలంగాణ-కడెం

ప్రజలకు సేవలు అందించిన నాయకులకు ప్రత్యక్షేత్రంలో గుర్తింపు ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్కే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని వారి సమస్యల సాధనకు కృషి చేసిన ప్రజాప్రతినిధులను అభినందించారు. ఇక ముందు కూడా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ అరుణ పాల్గొన్నారు.

తలమడుగు : జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్‌లతోపాటు ఎంపీటీసీలు మాజీ సర్పంచులకు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఇందులో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్, మావల మండల కేంద్రాలలో బుధవారం ఎంపీపీలు, ఎంపీటీసీలకు ఆత్మీయ సమ్మేళనం చేసి వీడ్కోలు సభ ఏర్పాటు చేసి సత్కరించారు. ఆదిలాబాద్, మావల ఎంపీపీలు గంద్రత్ రమేష్, సంగీత, జడ్పీటీసీలు నల్ల వనిత, వైస్ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, జంగు పటేల్, మాజీ ఎంపీపీలు సేవ్వ లక్ష్మి జగదీష్, చందాల ఈశ్వరి రాజన్న, కోఆప్షన్ సభ్యులు షేక్ అరీఫ్, కరీం ఖాన్, ఎంపీ ఓలు శోభన, వెంకటరాజు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని గ్రామాలకు చెందిన 61 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో లబ్దిదారులకు అందించి పథకాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విలాస్, రామ్ శంకర్ రెడ్డి, రామ్ రెడ్డి, రాజేశ్వర్, తిరుమల చారి, తహసీల్దార్ శ్రీదేవి, డీటీ రవీందర్, ఆర్ఐ వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో విద్యార్థి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుద్ఘాతంతో విద్యార్థి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో ఈ ఘటన బుధవారం జరిగింది. మావల ఇన్‌చార్జీ ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలం భూతాయికి చెందిన ఫడ్ బాలాజీ కుమారుడు గోపాల్ కాలనీలో ఆడుకుంటూ సందుగుండా వెళుతుండగా ప్రమాదవశాత్తు రఫీక్ ఇంటి కిటికీకి అమర్చిన కూలర్‌ను ముట్టుకున్నాడు. కూలర్‌కు కరెంటు సరఫరా అవుతుండటంతో విద్యుద్ఘాతానికి గురై పక్కనే ఉన్న డ్రెయిన్‌లో పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కూలర్ ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వదిలేసిన రఫీక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవ తెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఐదు సంవత్సరాల కాలంలో ఆయా గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేల సహకారాలతో ప్రతి మారుమూల గ్రామాలలో అభివృద్ధి చేసుకున్నామని ఎంపీపీ అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రమేష్, జడ్పీటీసీ సంధ్యారాణి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తహీర్, వైస్ ఎంపీపీ లింబాజీ, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోన్నతిపై వెళ్లిన ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ఉద్యోన్నతిపై వెళ్తున్న నేరెల్ల మధుకర్‌ను బుధవారం ఆస్పత్రి వైద్య సిబ్బంది సన్మానించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుని అభినందించారు. డా. వేదవ్యాస్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్ గౌడ్, సరస్వతి, ఫార్మాసిస్ట్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ రాజేందర్, కిరణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



నవతెలంగాణ-వాంకిడి

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదుచేసి, ఫిర్యాదు దారులకు రిసిప్టు ఇవ్వాలని, వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాస్ పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం వాంకిడి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్, రిసెప్షన్ కౌంటర్, లాకర్ గదులు తదితర వాటిని పరిశీలించి సూచనలు చేశారు. రోజూ విధులు నిర్వహించే అధికారుల గదుల్లో రికార్డులను భద్రపరుచుట, స్టేషన్ పరిసరాలు, గదులను, రికార్డులను ఎవరి పరిధిలో వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌లో రోజూవారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ తదితర రికార్డులను తనిఖీ చేసి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.

జిల్లాకే ఆదర్శం కౌటాల

- డీఆర్డీఓ సురేందర్



నవతెలంగాణ-కౌటాల

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఆదర్శ మండలంగా కౌటాల ఉందనడానికి ఎలాంటి సందేహం లేదని డిఆర్డిఓ సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాలులో కౌటాల మండల ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు ఇంత మారుమూల ప్రాంతం అయినప్పటికి ప్రజా ప్రతినిధుల కృషి, అధికారుల సహకారంతో మండలం అన్ని రంగాల్లో ముందుందన్నారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సిద్దల దేవయ్య, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొముురం మాంతయ్య, డిఎల్పిఓ ఖమర్ హుస్సేన్, ఎంపిడిఓ అబ్దుల్ నస్రుల్లా ఖాన్, ఎంపిఓ మహేందర్ రెడ్డి, ఏపిఓ పూర్ణిమ, ఏపిఎం ముక్తేశ్వర్, ఎంఏఓ రాజేశ్, ఏఇఒ ఇనోష్, పలువురు పాల్గొన్నారు.

వంకులం రేషన్ దుకాణం స్థానికులకే ఇవ్వాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని వంకులం గ్రామంలో గల రేషన్ షాపును రెబ్బెన నివాసికి ఇచ్చారని, ఆ దుకాణం స్థానికులకు ఇవ్వాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆత్మకూరు సతీష్ కోరారు. బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డీలర్ శంకర్ లాల్ జైస్వాల్‌కు వంకులంతో పాటు రెబ్బెనలో కూడా షాప్ ఉందన్నారు. పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు జరిపి అదనపు నిల్వ ఉన్నందున కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. అయిన వంకులంలోని షాప్ వారే నిర్వహిస్తున్నారని తెలిపారు. షాప్‌నీ వంకులం గ్రామస్థులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి నీలేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మహిళలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జడ్పీ చైర్పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ మహిళ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జడ్పీ చైర్పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో మహాలక్ష్మీ పథకం కింద మహిళాలకు రూ.2500 ఇస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్న రూ.2500 ఇంకా రాలేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతులకు పంపిణీ చేస్తానన్న స్కూటి ఏమైందని ప్రశ్నించారు. అలాగే నవవధుకి ఇస్తానన్న తులం బంగారం డిసెంబర్ నుండే అమలు చేయాలి, అప్పటి నుండి పెళ్లి చేసుకున్న ప్రతి యువతికి తులం బంగారం ఇవ్వాలన్నారు. రూ.ఐదు లక్షల విద్యార్థి హామీ కార్డు వెంటనే ఇవ్వాలని, మహిళలకు పెన్షన్ రూ.4000 బకాయిలుతో సహా చెల్లించాలన్నారు. కాంగ్రెస్ మహిళాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళ మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, ముఖ్య కార్యదర్శి అనిత, సీతమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.